క్లుప్తంగా

ఎస్సైలను అభినందించిన ఎస్పీ


ప్రశంస పత్రం అందుకుంటున్న ఖాదర్‌బాషా, రాజారావు

టంగుటూరు/పొన్నలూరు: అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను తగ్గించడంలో కృషి చేసినందుకుగాను టంగుటూరు, పొన్నలూరు ఎస్సైలు షేక్ ఖాదర్ బాషా, దాసరి రాజారావును ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినదించారు. ఈ మేరకు గురువారం ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సైలకు ప్రశంస పత్రాలు అందజేశారు.

కుటుంబ సర్వేకు సహకరించాలి

మద్రిపూడి: కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మద్రిపూడి వైద్యాధికారిణి సంగీత కోరారు. మండలంలోని కూచిపూడి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసినట్లు తెలిపారు. కుటుంబ ఆదాయం, ఖర్చుల వివరాలు, బీపీ, సుగర్ వ్యాధులు ఏమైనా ఉన్నాయా? మందులకు ఎంత ఖర్చు అవుతోంది, రోజుకు బియ్యం, నిత్యవసర సరుకులకు ఎంత ఖర్చవుతుంది? అన్నీ పోనూ ఎంత మిగులుతుంది? తదితర అంశాలపై సర్వే చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నర్సమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ రమ్యకృష్ణ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు. పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత భీమవరం

ఉలవపాడు: క్రికెట్ పోటీల్లో విజేతగా భీమవరం జట్టు నిలిచింది. దండే కృష్ణ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నియోజకవర్గ పరిధిలో ఈ నెల 12 నుంచి 19 వరకు భీమవరంలో నిర్వహించారు. పోటీల్లో ఫైనల్‌కు మన్నేటికోట, భీమవరం జట్టు చేరగా భీమవరం జట్టు విజయం సాధించి రూ.15,000 బహుమతి గెలుచుకుంది. రన్నరప్‌గా నిలిచిన మన్నేటకోట జట్టు రూ.10,000, తృతీయబహుమతి పాలూరు జట్టు రూ.5000 సాధించింది.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

గుడ్లూరు: ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం సచివాలయాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని రావూరు గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులో సేవలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 8 గ్రామ సచివాలయాలయాలలో ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. 20వ తేదీ చేవూరు, 21న మోచర్ల, 23న చినలాటరఫి, 24న నాయుడుపాలెం, ఫిబ్రవరి 7న పరకొండపాడు, 8న పోట్లూరు, 9,10 తేదీల్లో ఏలూరుపాడులలో శిబిరాలు జరుగుతాయన్నారు.

యువజన కళా ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

కందుకూరు అర్బన్: శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో యువజన విభాగం డాక్టర్ బోయి భీమన్న సాహిత్య నిధి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువజన కళా ఉత్సవ్ పోస్టర్‌ను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి ఈశ్వరీభూషణం, రాష్ట్ర కార్యదర్శి పిల్లి హజరత్తయ్య, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనుకొల్లు మస్తానయ్య, కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

ఎస్సైగా మహేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

వెలిగండ్ల: ఎస్సైగా పి.మహేష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన విశ్వనాథరెడ్డి నెల్లూరుజిల్లా మద్రిపాడుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఒంగోలు గ్రీవెన్స్‌సెల్‌లో పనిచేస్తున్న ఎస్సై మహేష్‌కుమార్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మహేష్ కుమార్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కనిగిరి రూరల్: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డిఅన్నారు. మండలంలోని వాగుపల్లిలో జరిగిన మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు గురువారం రాత్రి అందచేశారు. క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి విజేతగా వాగుపల్లి ఎస్సీ కాలనీ టీం, ద్వితీయ బహుమతిగా వాగుపల్లి హోం టీం, తృతీయ బహుమతి శంఖవరం టీమ్ సాధించారు. విజేతలకు మొదటి బహుమతి నగదు రూ.15వేలు సర్పంచ్ గోవిందరెడ్డి, ద్వితీయ బహుమతి రూ 10 వేలు పేరం వెంకటేశ్వరరెడ్డి, తృతీయ బహుమతి రూ.7 వేలు వీరంరెడ్డిబాబు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, సర్పంచ్ నాగేంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతు ఆదాయం పెంచడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తుందని, దీనిలో భాగంగానే ప్రతినెలా ధరల స్థిరీకరణ నిధి సమావేశాలు నిర్వహించి మార్కెట్ ధరలు, మద్దతు ధరల మధ్య వ్యత్యాసాన్ని అంచనా వేస్తుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో గురువారం నిర్వహించిన ధరల స్థిరీకరణ నిధి సమావేశంలో ఆయన మాట్లాడారు.

పంటల్లో వస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల ద్వారా నిరంతరం సూచనలు చేస్తున్నామన్నారు. మిరపలో వస్తున్న ఎర్రమల్లి తెగులు నివారణకు ఇప్పటి వరకు ఎటువంటి మందులు లేవన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల ద్వారా దీన్ని కొంత వరకు అరికట్టవచ్చని గుర్తించామన్నారు. మాండస్ తుఫాన్ వల్ల మినుము, వేరుశనగ, శనగ పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అదును దాటక ముందే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద వీరికి తిరిగి విత్తనాలు పంపిణీ చేసిందన్నారు. ఈ ఏడాది మామిడిలో ఆశించిన స్థాయిలో దిగుబడి ఉండకపోవచ్చుననే అంచనా వేస్తున్నామని, మామిడిలో వస్తున్న పండు ఈగ తెగులు నివారణకు అన్ని ప్రయత్నాలు చేశామన్నారు. శాస్త్రవేత్తల ద్వారా ఇప్పటికే ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో రైతులకు విస్తృత అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. పండుఈగ తెగులు నివారణకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, అయితే ఇప్పటి వరకు ఎంత శాతం నివారించగలిగామనేది కూడా ముఖ్యమేనన్నారు. వేరుశనగ అక్రమ నివారణకు జాతీయ రహదారిపై కరేడు ర్యాంపు వద్ద మార్కెట్‌యార్డు ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని ద్వారా వారంలోనే రూ. 44వేల అదనపు ఆదాయం వచ్చిందన్నారు.

తగిన వరి సాగు

నియోజకవర్గంలో ఈ ఏడాది 30శాతం మేర వరి సాగు తగ్గిందన్నారు. వరిలో సాగు ఖర్చులు పెరుగుతుండడం ఆదాయం కూడా తక్కువగా వస్తుండడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రధానంగా పత్తి, మిరప వంటి పంటలను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. మిరపకి మార్కెట్‌లో మంచి ధర ఉందని, మద్దతు ధర కంటే దాదాపు రూ. 10వేల అదనపు రేటు పలుకుతుందన్నారు. అలాగే పత్తికి కూడా ప్రస్తుతం క్వింటా రూ.7500 వరకు ధర ఉందని, భవిష్యత్‌లో ఇది మరింత పెరిగే అవకావం ఉందన్నారు. గతేడాది పత్తి సాగులో అధిక లాభాలు రావడం వల్ల రైతులు ఎక్కువగా పత్తి సాగు వైపు మొగ్గు చూపుతున్నారని స్పష్టం చేశారు.

దళారీ వ్యవస్థతో నష్టం

దళారీ వ్యవస్థ ద్వారా రైతులకు నష్టం వస్తుందని, దీని నివారణకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డులో మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే అనుమతులు వచ్చినా తుఫాన్ వల్ల నష్టపోయిన మినుములు కొనుగోలు విషయంలో సందిగ్ధత ఉన్న నేపథ్యంలో ప్రారంభం ఆలస్యమైందన్నారు. దీనిపై వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడమని, తడిచిన మినుముము కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎం శ్రీనివాసులు, ఏడీఏ శేషగిరి, ఉద్యానవనశాఖ అధికారి బ్రహ్మసాయి, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

- రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి
- మండల సమావేశంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి


మాట్లాడుతున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

పామూరు: సమస్యల పరిష్కారంపై మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో గురువారం మండల సమావేశం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వచ్చే సమావేశం నాటికి ప్రతి ఎంపీటీసీ, సర్పంచ్‌లు వారి పరిధిలో ప్లాస్టిక్‌వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించేలా చూడాలన్నారు. సమావేశాలకు వచ్చే సమయంలో గాజు, ఇతర మెటల్స్‌కు చెందిన వాటర్‌బాటిల్స్ ఉపయోగించాలని, సమాజంలో మార్పు మన నుంచే ప్రారంభం కావాలని సూచించారు. 104 వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకురాగా..స్పందించిన ఎంపీపీ 104 షెడ్యూల్ విధిగా సచివాలయాలు, ఎంపీటీసీ, సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వాలని డాక్టర్ హరిబాబు, విజయ్‌కుమార్‌లకు సూచించారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య మాట్లాడుతూ మోపాడు పరిధిలోని ప్రభుత్వ భూమిని సుమారు 20 ఎకరాలు అక్రమించి కొందరు జామాయిల్ సాగుచేస్తున్నారని, ఆక్రమణలను తొలగించి పేదలకు పంపిణీచేయాలని కోరారు. తూర్పుకోడిగుడ్లపాడు సర్పంచ్ దారపనేని కొండబాబు తమ పంచాయతీలోని 94 సర్వేనంబర్‌లో ప్రభుత్వభూమి ఆక్రమణలకు గురయిందని, సర్వేనంబర్ 110 లో స్మశానస్థలం కేటాయించాలని కోరారు. కాగా వగ్గంపల్లి పంచాయతీలో ప్రభుత్వ, వాగు భూములు ఆక్రమణకు గురయ్యాని ఎంపీటీసీ రెక్కల అలనితారెడ్డి, సర్పంచ్ సుబ్బయ్య తెలిపారు. పామూరు ఎంపీటీసీ షేక్ అబ్దుల్, ఆకుపాటి వెంకటేష్, యాటాగోవిందమ్మ, నాసర్‌బీలు మాట్లాడుతూ పామూరులో సుమారు 20 ఏళ్ల వేసిన లేఅవుట్‌లకు ఇప్పుడు కన్వర్షన్ కట్టమని హద్దురాళ్లను పీకివేస్తున్నారని దీనిపై ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ఎంపీపీ, తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. దీనిపై తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాగుభూముల్లో లే అవుట్‌లు నిషేధమని, ప్లాట్లు కొనుగోలు చేసిన వారి వద్ద నుంచి లేదా లేఅవుట్‌దారులే నిర్దేశిత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తే తక్షణం కన్వర్షన్ ఇస్తామన్నారు. ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, వారి భూములను ఆన్‌లైన్ చేయించి ప్రభుత్వ పథకాలు వచ్చేలా చూడాలని తహసీల్దార్ ప్రసాద్‌కు సూచించారు. జలజీవన్‌మిషన్ పథకంలో భాగంగా వేస్తున్న పైప్‌లైన్‌ను రోడ్లపైనే ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పైప్‌లైన్‌ను భూమిలో వేసేలా చూడాలని కోరారు. ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ గంధం యేసురత్నం, కోఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచే నాయకుడు సీఎం జగనన్న


యువతితో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

పోలిరెడ్డిపాలెం (కొండపి): జనరంజక పాలనతో దేశ చరిత్రలో గుర్తుంచుకునే నాయకుడిగా సీఎం జగనన్న ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని చినకండ్లగుంట పంచాయతీ పోలిరెడ్డిపాలెంలో గురువారం అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు తిరిగి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. ఏ ఇబ్బంది లేకుండా నేరుగా జగనన్న సంక్షేమ పథకాలు తమకు అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ చిరునవ్వుతో అశోక్‌బాబుకు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలోలా ఒక వర్గానికి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అర్హతే గీటురాయిగా జగనన్న పథకాలు అందాయని అశోక్‌బాబు తెలిపారు. ఇంకా అర్హత ఉండి ఏ పథకమైనా దక్కకుంటే తమకు చెప్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు అశోక్‌బాబు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం జగనన్న దేశచరిత్రలో చరగని ముద్ర వేసుకున్న నాయకునిగా మిగిలిపోతారని కొనియాడారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుంటే ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానం పలుకుతున్నారని వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. సర్పంచ్ ఎస్‌కే వన్నూరు సాహెబ్, పార్టీ నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మాదాసి వెంకయ్య

టంగుటూరు: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగకరమని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య అన్నారు. స్థానిక పోతుల చెంచయ్య కాలనీలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రజా వైద్య కేంద్రంలో గురువారం ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. 45 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దుగ్గిరాల సునీల్, నత్తల హరిబాబు, బుర్రి చంద్ర, వెంకట్రావు, బొడ్డు శ్రీను, నత్తల క్రాంతి, రాంబాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి


కొండపిలో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కొండపి: యోగి వేమన జయంతిని స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక శాఖా గ్రంధాలయంలో లైబ్రేరియన్ గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో గురువారం యోగి వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన సాహిత్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుకు కృషి


వార్డులోని ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీలోని 26వ వార్డులో కమిషనర్ ఎస్. మనోహర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 26వ వార్డు పరిధిలోని అమలనాథుని వారిపాలెం, వడ్డెపాలెం, గణేష్‌నగరులలో అవసరమై చోట రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉందని, షాపుల యజమానులు నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తే షాపులు సీజ్‌తో పాటు భారీ జరిమానులు విధిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ డీఈ, టీపీఓ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయాలు తనిఖీ

వెలిగండ్ల: సచివాలయ ఉద్యోగులు అంకితభావంగా పనిచేయాలని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. మండలంలోని మరపగుంట్ల, కొట్టాలపల్లి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ టి.సుకుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ 25 ఏపీ సేవలను తప్పకుండా చేయాలన్నారు. ఏపీ సేవలో వచ్చిన నగదును ఏరోజుకు ఆరోజు బ్యాంక్‌లో జమచేయాలన్నారు. ఉదయం 10:30 గంటలకు తప్పకుండా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. యూనిఫాం తప్పక ధరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వలేటివారిపాలెం: సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్, ఉద్యానవన అధికారి పి.బ్రహ్మ సాయి అన్నారు. మండలంలోని శింగమనేనిపల్లి మిరప, శనగ పంట పొలాలను వ్యవసాయాధికారి హేమంత్ భరత్ కుమార్, ఉద్యానవన అధికారి బ్రహ్మసాయి శుక్రవారం పరిశీలించారు. రబీలో సాగు చేసిన పంటలను గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా పంట నమోదు చేసుకోవాలన్నారు.

సింగరాయకొండ: పంటల్లో తెగుళ్ల నివారణకు ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడటం వల్ల పైరులో తెగుళ్లు, పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పాకల వరి పొలాల్లో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, ఎంపిటిసి గోళ్లమూడి అశోక్ కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: వ్యవసాయాధికారులు సలహాలు సూచనలు పాటించి వరిలో తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయాధికారి బి. సంపత్‌కుమార్ అన్నారు. గురువారం సీతారాంపురం రైతు భరోసా పరిధిలోని మాసాయిపేటలో వరి పంట సాగులో పొలంబడి నిర్వహించారు.వరి పంటకు సోకిన తెగుళ్లకు తీసుకోవాల్సిన నివారణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు సలహాలు సూచనలిచ్చారు. సస్యరక్షణ చర్యలు, విత్తనశుద్ధితో 90 శాతం తెగుళ్లను నివారించవచ్చన్నారు. వీఏఏ కె. నవ్య, రైతులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి


బహుమతులు అందజేస్తున్న బ్రదర్ అనీల్

సీఎస్‌పురం: క్రీడలు యువకుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని బ్రదర్ అనీల్ అన్నారు. స్థానిక డీజీపేట రోడ్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఆర్ఎస్‌వీజే మెగా క్రికెట్ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రదర్ అనీల్ మాట్లాడుతూ వెనుకబడిన ఈ ప్రాంతంలో ఇటువంటి పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ నెల 8 నుంచి నిర్వహించిన పోటీల్లో 40 జట్లు పాల్గొనగా గురువారం జరిగిన ఫైనల్‌లో వెంగనగుంట–కందుకూరు జట్లు తలపడ్డాయి. వెంగనగుంట జట్టు విజయం సాధించి ప్రథమస్థానంలో నిలవగా కందుకూరు జట్టు ద్వితీయ స్థానంలో, పామూరు జట్టు తృతీయస్థానంలో నిలిచింది. విజేతలకు బహుమతులుగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.30 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: ఇళ్ల పరిసరాల్లో, వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చేయాల్సిన బాధ్యత గ్రీన్ అంబాసిడర్స్ దేనని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రీన్ అంబాసిడర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే ప్రతి ఇంటికీ తిరిగి చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీలో చేర్చాలన్నారు. గ్రామాలను అతిసుందరంగా ఉంచాలన్నారు. రిక్షా, డస్ట్‌బిన్‌లను అందచేశారు.

గాయపడిన వారికి చెక్కులు పంపిణీ


చెక్కులు అందచేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్

గుడ్లూరు: కందుకూరులో గత నెలలో జరిగిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రోడ్‌షోలో గాయపడిన మండలానికి చెందిన నలుగురుకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్ చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని తెట్టు గ్రామానికి చెందిన షేక్ మన్సూర్, మోచర్ల గ్రామానికి చెందిన గోచిపాతల రమేష్, దప్పళంపాడు గ్రామానికి చెందిన చెరుకూరి మాల్యాద్రి, గుండ్లపాలెం గ్రామానికి చెందిన మద్దులూరి రాగమ్మలు గాయ పడ్డారు. వారి వైద్య ఖర్చులు నిమిత్తం ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మంజూరు చేయగా గురువారంచెక్కులను బాధితులకు అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ అంజలయ్య, వైఎస్సార్‌సీపీ మండల మీడియా అధికార ప్రతినిధి బిల్లా రమణయ్య పాల్గొన్నారు.

కార్మికులకు నియామక పత్రాలు అందజేత

కందుకూరు అర్బన్: కరోనా సమయంలో కష్టపడి పనిచేసిన కాంట్రాక్ట్ కార్మికులకు అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా మున్సిపల్ కార్మికులుగా ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా కార్మికులుగా ఎంపికైన వారికి ఉద్యోగ భద్రత నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనాలో చాలా మంది కష్టపడి పనిచేశారని, కొంతమంది కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి ఈ ఉద్యోగాలు రావడం వల్ల వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్. మనోహర్ ఉన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నేతలు

హనుమంతునిపాడు: యువత విద్యతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభను కనపర్చాలని వైఎస్సార్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసుల రెడ్డిలన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం బహుమతులు పంపిణీ చేశారు. పోటీల్లో మొదటిస్థానంలో హెచ్‌ఎంపాడు నారాయణరెడ్డి 11 టీమ్, ద్వితీయ స్థానంలో హెచ్‌ఎంపాడు గంటా మల్లికార్జున్ టీమ్, తృతీయస్థానంలో గాయం వారిపల్లి నిలిచాయి. వారికి బహుమతులుగా రూ.20,116, రూ.15,116, రూ.10,116 అందజేశారు.

సీఎస్‌పురం: ఆర్‌వైసీసీ క్రికెట్ పోటీలలో రేగులచెలక జట్టు విజయం సాధించింది. సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని రేగులచెలకలో జిల్లా స్థాయిలో ఆర్‌వైసీసీ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 11 నుంచి జరిగిన పోటీల్లో 30 జట్లు పాల్గొనగా గురువారం జరిగిన ఫైనల్ పోటీలలో రేగులచెలక ఆర్‌వైసీసీ– గణేశునిపల్లి జట్లు తలపడగా రేగులచెలక ఆర్‌వైసీసీ జట్టు విజయం సాధించింది. రేగులచెలక సర్పంచ్ బత్తుల కృష్ణకుమారి రమణయ్య సహకారంతో ప్రథమ బహుమతి రూ.20,116, బండ్ల శ్రీనివాసులు సహకారంతో ద్వితీయ బహుమతి రూ.10,116 విజేతలకు అందజేశారు.

క్రీడలతో ఐకమత్యం పెంపు


విజయం సాధించిన క్రీడాకారులతో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

సీఎస్‌పురం: క్రీడలు యువతను సన్మార్గంలో నడిచేందుకు దోహదం చేస్తాయని వైఎస్సార్ సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరిగిన కేఎస్ రాయల్, ఎస్‌వీ ప్రసాద్ స్మారక క్రికెట్ పోటీలలో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్ రాయల్, ఎస్‌వీ ప్రసాద్‌ల జ్ఞాపకార్థం వారి స్నేహితులు ఏటా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 8న ప్రారంభమైన పోటీల్లో 28 జట్లు తలపడ్డాయి. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సీఎస్‌పురం ఫాండర్స్ లెవెన్–సీఎస్‌పురం దడ జట్లు పోటీ పడగా సీఎస్‌పురం ఫాండర్స్ లెవెన్ జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతి గెలుచుకుంది. సీఎస్‌పురం దడ జట్టు ద్వితీయస్థానం, సీఎస్‌పురం పీఎస్‌పీకే జట్టు తృతీయస్థానంలో నిలవగా బహుమతులుగా రూ.50,116, రూ.30,116, రూ.15,116 అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.డేవిడ్, సర్పంచ్ షేక్ ఖాదర్‌బీ బుజ్జి, బొట్ల చిరంజీవి, ఎంపీటీసీ బత్తుల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కనిగిరి రూరల్: బోరింగ్ హ్యాండిల్ రాడ్డు కడుపులో గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..ఇందిరాకాలనీకి చెందిన నాగరాజు బుధవారం రాత్రి బైక్‌పై వేగంగా వస్తూ రాజీవ్‌నగర్‌లో రోడ్డుపై ఉన్న హ్యాండ్ బోరింగ్‌ను ఢీ కొనడంతో బోరింగ్ హ్యాండిల్ రాడ్డు కడుపులోకి దిగింది. వెంటనే స్థానికులు వెల్డింగ్ ద్వారా చేతి పంపు నుంచి హ్యాండిల్‌ను వేరు చేసి క్షతగాత్రున్ని ఒంగోలుకు తరలించారు. ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.